మెట్రోచార్జీల పెంపు నిర్ణయం విరమించుకోవాలి

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోచార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పలు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చార్జీలు పెంచవద్దని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ గ్రేటర్ కార్యదర్శి ఎం.హన్మేష్ ఆధ్వర్యంలో వామపక్షనేతలతో విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర సెంట్రల్ కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శివర్గ సభ్యులు శ్రీకాంత్, న్యూడెమోక్రసీ హైదరాబాద్,రంగారెడ్డిజిల్లాల కార్యదర్శిఝాన్సీ, ఎస్‌యూసీఐ నగర నాయకులు తేజ, సీపీఐ ఎంఎల్ నాయకులు విజయ్, ఎస్ఎల్.పద్మ, పీవైఎల్ ప్రదీప్ పాల్గొని మాట్లాడారు. నష్టాలపేరుతో ప్రయాణికులపై భారాన్ని మోపేందుకే చార్జీల పెంపు ఆలోచనచేయడం తగదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మెట్రోచార్జీల పెంపు తగ్గకుండా చూడాలన్నారు. 25 శాతం నుంచి 30 శాతం వరకు రేట్లు పెంచాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చార్జీలపెంపు వల్ల ప్రయాణికులపై ఆధికభారం పడుతుందన్నారు. చార్జీలు పెంచితే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రవీణ్, రవి, కృష్ణ, లింగంగౌడ్, పుష్ప, కిరణ్‌రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అఖిల భారత రైతు ధర్నా: మాజీ ఎమ్మెల్యే

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈ నెల 8న నిర్వహిస్తున్న అఖిల భారత రైతు ధర్నాను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐయుకేఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మడి నర్సయ్య కోరారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ నూతన వ్యవసాయ మార్కెట్ విధానం వల్ల రైతులకు నష్టం కలుగుతుందన్నారు. పాత చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళలను దూషించిన వ్యక్తికి 15 రోజుల జైలు

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మహిళలను అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తికి జడ్జి 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ ఎస్ఆర్‌టీ పార్కుకు చెందిన సి.పాండు(41) మద్యం మత్తులో పార్కు పరిసర ఇళ్లల్లో నుంచి చిన్నచిన్న ఇనుప వస్తువులు దొంగిలిస్తున్న సమయంలో గుర్తించి కొందరు మహిళలు అతన్ని అడ్డగించారు. దీంతో కోపోద్రిక్తుడైన పాండు అసభ్య పదజాలంతో వారిని దూషించాడు. బాధిత మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పాండును నాంపల్లి ఐదో ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. నిందితుడికి 15 రోజుల సాధారణ జైలుశిక్ష విధించారు.

రసమయి రాముకు పురస్కారం

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ స్థాపకుడు డా.ఎంకే.రాముకు కళా సుబ్బారావు స్మారక సాంస్కృతిక పురస్కారం బహూకరిస్తున్నట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. ఈనెల 9న సుబ్బారావు జయంతి వేడుకలు గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని డా.రాముకు పురస్కారం బహూకరిస్తారన్నారు. రచయితలు ఆచార్య కొలకలూరి ఇనాక్, ముదిగొండ శివప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి : కేవీపీఎస్



సమావేశంలో అభివాదం చేస్తున్న పలు సంఘాల నేతలు

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పలువురు వక్తలు కోరారు. మనువాద, కార్పొరేట్ విధానానికి వ్యతిరేకంగా నడవాలని వారన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు సారథ్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ, ఐద్వా, కేవీపీఎస్ నేతలు జి.వెంకటేష్, మల్లు లక్ష్మి, ఎండీ.అబ్బాస్, ఆర్.వెంకట్రాములు, కోలజనార్దన్, పి.జంగారెడ్డి, శ్రీహరి, ధర్మానాయక్, కోట రమేష్, జి.నరేష్, రాములు, అరుణజ్యోతిలు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను రద్దు చేయాలన్నారు. దళితుల ఆరు లక్షల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



తెలంగాణ ప్రజాసాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు అల్లూరి సీతారామరాజు వేషధారణతో అలరించారు. ప్రజాసాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, నరేష్, రాజయ్యగౌడ్, రుక్మిణి, పద్మ, మహేష్ పాల్గొన్నారు. - రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి)

అయోధ్య, కాశీలో స్థలం కేటాయించాలి: ఎంపీ లక్ష్మణ్

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు భక్తుల కోసం అయోధ్య, కాశీలో వసతి, పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని యూపీ సీఎం యోగీఆదిత్యను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఆయా ప్రాంతాల్లో ఎకరం చొప్పున స్థలాలు కేటాయిస్తే అక్కడ తన ఎంపీ నిధులతో వసతి, పార్కింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తన వినతిపై యూపీ యోగీఆదిత్య సానుకూలంగా స్పందించారని డా.కె.లక్ష్మణ్ తెలిపారు.

రైలుకింద పడి ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ ప్రైవేట్ ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలో నివాసం ఉంటున్న కందాడి ఆకాష్(23) ప్రైవేట్ ఉద్యోగి. ఓ యువతిని ప్రేమించగా ఆమె నిరాకరించింది. ప్రేమ విఫలమైన ఆకాష్ తీవ్ర మనోవేదనకు గురై బుధవారం యాకత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భారీ వర్షం.. కూలిన భారీచెట్టు, విద్యుత్ జంక్షన్

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి గాలిదుమారంతో కూడిన భారీ వర్షానికి గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్ బస్తీలో పెద్ద చెట్టు కూలిపోయింది. విద్యుత్ జంక్షన్‌పై చెట్టు పడ్డంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఫిర్యాదు అందుకునన కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ సీబీడీ ఏడీఈ వినోద్‌కుమార్‌కు సమాచారం అందించారు. బీజేపీ సికింద్రాబాద్ జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తోపాటు బీజేపీ నేతలు పలువురు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వాల్మీకినగర్‌కు చేరుకున్న ఏడీఈ వినోద్‌కుమార్, గాంధీనగర్ ఏఈ సంతోష్ తెగిపడిన విద్యుత్ వైర్లను తొలగింపచేశారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది విద్యుత్ జంక్షన్‌పై పడిన చెట్టు కొమ్మలు తొలగించారు. నిలిచిపోయిన కరెంట్ సరఫరాను బుధవారం మధ్యాహ్నం పునరుద్ధరించారు.

చర్లపల్లి-బెర్హంపూర్ మార్గంలో 16 వేసవి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ: వేసవి రద్దీని పురస్కరించుకొని చర్లపల్లి- బెర్హంపూర్ మార్గంలో 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈ నెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15గంటలకు చర్లపల్లి నుంచి బెర్హంపూర్‌కు (07027) ప్రత్యేక రైలు, ఈ నెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం బెర్హంపూర్ నుంచి చర్లపల్లికి (07028)ప్రత్యేక రైలు బయల్దేరుతాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. మార్గమధ్యంలో (ఇరువైపులా) ఈ ప్రత్యేకరైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు.

పాకిస్థాన్‌కు భారత సైన్యం దీటైన జవాబు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాం పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా భారత జవాన్‌లు దీటైన జవాబు చెప్పారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత జవానులు జరిపిన మెరుపుదాడులకు హర్షం వ్యక్తంచేస్తూ, భద్రతాదళాలకు సంఘీభావం వ్యక్తం చేశారు. భారత్ మాతాకి జైజై జవాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాఫెల్స్‌తో పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడంతోపాటు ఉగ్రవాదులను భారతజవాన్లు మట్టుపెట్టడంపై దేశంలోని ప్రతి పౌరుడూ గర్విస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్ హౌస్ శ్రీనివాస్, ఎండీ మోహిన్, జావిద్ ఖాన్, పరుశురాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక బలగాలకు ధన్యవాదాలు



భారత జాతీయ పతాకాన్ని చేతపట్టి భారత సైన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): భారత సైనిక బలగాలకు ధన్యవాదాలు అని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదుల దుశ్చర్యలకు అమరులైన భారతీయుల మరణాలకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో భారత సైనిక బలగాలు మంగళవారం అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని 100కు పైగా లష్కరే తోయిబా ఐఎస్ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్ద బీజేపీ నేతలు సంబరాలు జరిపారు. బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ సంపూర్ణ మద్దతుతో సైనిక దళాలు సాహసోపేత చర్యలకు దేశవ్యాప్తంగా భారతీయులు నీరాజనం పలుకుతున్నారన్నారు. పార్టీ నేతలు నవీన్‌కుమార్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, ఉమేష్, ప్రకాష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, మదన్‌మోహన్, సాయికుమార్, దోనేటి సత్యం, సత్యేందర్, కుమార్, ధనరాజ్, జ్ఞానేశ్వర్, రఘుయాదవ్, సాయికృష్ణయాదవ్, నీరజ్, ప్రశాంత్, రాహుల్, భాను, కృష్ణవేణి, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ ఆధ్వర్యంలో సంబరాలు



రాంనగర్ గుండూ చౌరస్తాలో బాణాసంచా కాల్చుతున్న బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి దేశ ప్రజలంతా మద్దతు ఇవ్వాలని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ కోరారు. ఉగ్రదాడికి ప్రతీకరంగా భారతసైన్యం మంగళవారం తెల్లవారుజామున స్థావరాలను మట్టుబెట్టడాన్ని స్వాగతిస్తూ బుధవారం రాంనగర్ గుండూ చౌరస్తాలో బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు. బాణాసంచాలు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రాంనగర్ గుండూ నుంచి రాంనగర్ మీ సేవ వరకు జాతీయ పతాకంతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులుఆర్.శేషసాయి, కౌండిన్యప్రసాద్, సుబ్రహ్మణ్యం బాబు, కిషోర్, దర్గానర్సింగ్‌రావు, పవన్‌రెడ్డి, ఓంప్రకాష్, చంద్రశేఖర్, జగదీష్, సంగం బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ కాలనీలో మాక్‌డ్రిల్ పై అవగాహన

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బుధవారం నగరంలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌పై బోలక్‌పూర్ పద్మశాలీకాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇంటి తలుపులు మూసి, విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో కాలనీ అంతా నిర్మానుషంగా మారింది. సుమారు 45 నిమిషాలపాటు కాలనీవాసులంతా తమ ఇళ్లలోనే ఉన్నారు. ఈ సందర్భంగా పద్మశాలీకాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించామన్నారు. కాలనీలోని సుమారు 400 కుటుంబాలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా తలుపులు మూసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుందర్‌పరాలే, నాయకులు శ్రీనివాస్, కమల్‌కుమార్‌శర్మ, సుజాత, ఉమా పాల్గొన్నారు.



భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగమైన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కెనరాబ్యాంక్ పార్క్ వద్దనున్న గాంధీ విగ్రహం నుంచి అన్నానగర్, సబర్మతినగర్, అరుంధతినగర్ బస్తీలవరకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుంధతినగర్‌బస్తీలో జరిగిన బహిరంగ సభా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాజీద్‌హుస్సేన్ మాట్లాడుతూ భారతీయులైన మనందరం ప్రపంచంలోనే అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్‌కెన్నడీ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పోతులూరి విశ్వబ్రహ్మేంద్రస్వామి



వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ ఎంపీ వీహెచ్

కవాడిగూడ, మే 7 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని అని, దూరదృష్టితో భవిష్యత్‌ను ముందే తెలియజేశారని, ఆయన చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన ఉత్సవాలు ట్యాంక్‌బండ్‌పై విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ సంఘం నాయకుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు పీఎన్ చారి, విశ్వకర్మ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి నివాళి

రాంనగర్: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలలో భాగంగా బుధవారం ట్యాంక్ బండ్‌పై గల ఆయన విగ్రహానికి ఉత్సవాల కమిటీ చైర్మన్ అట్లూరి రవీంద్రచారి, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రవీంద్రచారి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాజీ సీఎం దామోదరం సంజీవయ్యకు నివాళి

మాజీ సీఎం దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేటకు చెందిన కాంగ్రెస్ నేతలు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు నాగభూషణం, లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

30 ఏళ్ల డ్రైనేజీ పైప్‌లైన్లను మార్చేస్తాం : ఎమ్మెల్యే గోపాల్



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లో అధ్వానంగా మారిన 30ఏళ్లక్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్‌లను సమూలంగా మార్చి పెరిగిన జనాభాకు అనుగుణంగా పునర్ నిర్మిస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని భరత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ... డ్రైనేజీ పైప్‌లైన్‌లు అధ్వానంగా మారడం వల్ల ఇండ్లలో ఉన్న బోరింగ్‌లలో మురుగునీరు వస్తోందన్నారు. అనంతరం క్రాంతి కుమార్, స్థానికులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రాత్రి తీవ్ర గాలిదుమారం, వర్షానికి గాంధీనగర్ డివిజన్ జగదాంబ హాస్పిటల్ వెనుకాల చెట్టు కూలి ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఏడీఈ సంపత్‌కుమార్, ఏఈలు సంతోష్, ఆనంద్ వారి సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని మరమ్మతులు చేశారు. బీఆర్ఎస్ నాయకులు జైసింహ, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

రాంనగర్: ముషీరాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని లక్ష్మమ్మ పార్కు వీధిలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సన్ని, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ, బీఆర్ఎస్ యువజన నాయకుడు జైసింహ, నాయకులు పాల్గొన్నారు.


● అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు బోర్లకుంట దీపక్ కుమార్, భారత రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు పోలే నిరంజన్, నిమ్మల యాదగిరి, నల్లగొండ నరేందర్, కరుణాకర్‌గౌడ్, మాసాని మహేష్, కందిమల్ల కృష్ణ, పి.శ్రీకాంత్ తదితరులు పోలీస్‌స్టేషన్‌లో కలిసి సత్కరించారు. (గోల్నాక, మే 7 ఆంధ్రజ్యోతి)

3.154 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

● కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఇద్దరు అరెస్ట్, పరారీలో మరో వ్యక్తి



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, సీఐ ఎల్లప్ప

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి షాద్‌నగర్‌కు రైలులో 3.154 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, సీఐ ఎల్లప్ప, ఆర్‌పీఎఫ్ సీఐ మాల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన భావన్ సుబోధి గంజాయిని విక్రయిస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన భగబన్ సంపతి(23), సుమన్‌ంతా మోహంతి(24) ఇద్దరూ స్నేహితులు. ఒకే గ్రామానికి చెందిన వారు. భగబన్ సంపతి షాద్‌నగర్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి భావన్ సుబోధితో పరిచయం ఏర్పడింది. గంజాయి సరఫరా చేస్తే డబ్బులు ఇస్తానని ఆశచూపాడు. ఉద్యోగం వదులుకుని గ్రామంలో ఖాళీగా ఉంటున్న సుమన్‌ంతా మోహంతికి ఈ విషయం చెప్పాడు. ఇద్దరూ కలిసి విశాఖపట్నంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి రెండు బ్యాగుల్లో ఎండు గంజాయిని తీసుకుని, విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌రైలులో ఎక్కారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగారు. షాద్‌నగర్‌లో ఉన్న భావన్ సుబోధికి సమాచారం ఇచ్చారు. అతని కోసం కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం 1 వద్ద ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో బీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా ఇద్దరూ అనుమానాస్పదంగా కన్పించారు. వారి రెండు బ్యాగులో రూ.1,57,700 విలువగల 3.154 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండ్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మొదటి ముద్దాయి భావన్ సుబోధిపరారీలో ఉన్నట్లు తెలిపారు.

లాలాగూడలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ బీటీమ్ సభ్యులు, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీటీమ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై శ్రీనివాస్‌కు లాలాగూడ ప్రాంతంలో ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కన్పించిన శివరాం(24), మహేందర్(25)ను తనిఖీ చేశారు. వారి వద్ద 1.2 కేజీల గంజాయి, రెండు ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నామోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కమిషనరేట్‌లో ముఖ్యకార్యదర్శి సమీక్ష

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కార్మికశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి దానకిషోర్ ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్‌లో కార్మికశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్య కార్యదర్శితోపాటు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న దానకిషోర్ కార్మికశాఖ అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ గంగాధర్, సంయుక్త కమిషనర్ చంద్రశేఖరం, జంటనగరాలు, రంగారెడ్డి జోన్ జేసీఎల్‌లు సునీతాగోపాల్‌దాస్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, డీసీఎల్‌లు శ్రీనివాస్‌గౌడ్, జానస్‌లతోపాటు ఏసీఎల్‌లు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు

ముషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో భవన నిర్మాణాన్ని దురుద్దేశ్యంతో అడ్డంకులు సృష్టిస్తున్న జీహెచ్ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ అధికారులపై భవన యజమానులు శంకర్, సాయి కిషోర్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కమీషనర్‌కు వినతి పత్రం అందజేసి, అధికారులు వేధిస్తున్న తీరును వివరించారు. ఇబ్బందులు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాస్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి చేపూరి వెంకటేశ్వరరావు ఆయన నియామకాన్ని ప్రకటించారు. 29 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పాటు చేస్తామన్నారు.

యుద్ధప్రాతిపదికన పూడికతీత

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్, లాల్‌బంగ్లా తదితర ప్రాంతాల్లో కచ్చామోరీల్లో పూడికతీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సంజయ్, నరేస్, భీమ్‌రాజ్, రవియాదవ్, వినోద్, దీపక్‌సింగ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీసెంట్రల్ జిల్లా మాజీఅధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు కోరారు. బుధవారం నల్లకుంటలో స్ఫూర్తిభవన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి, బీపీ చెకప్ చేయించుకున్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి

కవాడిగూడ, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కవాడిగూడ కొత్తబజార్‌లోని శంకరాధ్యరం(శివాలయం)లో పూజలు ఘనంగా నిర్వహించారు. కలశాల ఊరేగింపు, కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాకుడు మల్లంపేట రమేష్‌రాం, సంఘం అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా గౌరయ్య, పబ్బవిశ్వనాథం, భక్తులు పాల్గొన్నారు.

గోల్నాక: వాసవి మాత జయంతిని పురస్కరించుకుని అంబర్‌పేట నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండుతున్న ఎండల దృష్ట్యా అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో ప్రజలకు బట్టర్‌మిల్క్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఫౌండర్ చైర్మన్ కె.రాంచందర్‌గుప్త, అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌గుప్త, ప్రతినిధులు జైన శ్రీనివాస్‌గుప్తా, బి.వాసుగుప్తా, వి.వెంకటేష్‌గుప్తా, జిల్లా హరిబాబుగుప్తా, తదితరులు పాల్గొన్నారు.